ప్రజాశక్తి
సోమవారం 4 సెప్టెంబర్ 2023 8 పేజీలు


గుంటూరు


పల్నాడు



# సోలార్ ప్లాంట్ల సబ్సిడీకి మంగళం

### ఇళ్లలో కనెక్షన్లకు ప్రోత్సాహం కరువు - జనంపై విద్యుత్ భారాలేస్తున్న సంస్థలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఒకవైపు అనధికారికంగా విద్యుత్ కోతలు అమలు అవుతున్నాయి. పగటి పూట విద్యుత్ వినియోగం కోసం అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలకు తక్కువ ధరలకు విద్యుత్‌ను అందించేందుకు వీలుగా సబ్సిడీపై సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు అవకాశం ఉన్నా విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ దిశగా అడుగులు వేయడం లేదు. ప్రజలు ఎవరికి వారు తమ ఇళ్లల్లో సోలార్ కనెక్షన్లు తీసుకునేందుకు ముందుకు వస్తున్నా సబ్సిడీ నిలిపివేయడం సర్వత్రా విమర్శలు వక్తం అవుతున్నాయి.

సోలార్ కనెక్షన్లకు గతంలో సబ్సిడిపై కనెక్షన్లు ఇచ్చేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గత రెండేళ్లుగా సబ్సిడీ నిలిపివేశారు. పెద్ద నివాస భవనాలకు ఐదు కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటుకు నెడ్‌క్యాప్ సంస్థకు రూ.3.62 లక్షలు చెల్లించాలి. చిన్న నివాస భవనాలకు 3 కిలోవాట్ల ప్లాంట్‌కు రూ.2.29 లక్షలు చెల్లించాల్సి ఉంది. ఒక్కో సోలార్ కనెక్షన్‌కు 2019 వరకు 30 శాతం సబ్సిడీ ఇచ్చే వారు. గత మూడేళ్లుగా సబ్సిడీ నిలిపి వేశారు. ఇంత సొమ్ము ఒకేసారి చెల్లించి సామాన్యులు సోలార్ కనెక్షన్లు తీసుకోలేకపోయినా మధ్య తరగతి ప్రజలు కొంతవరకు తీసుకునే అవకాశం ఉంది.

అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేసి ప్రజలపై భారం మోపుతున్న పంపిణీ సంస్థలు సోలార్, విండ్ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి తగిన ప్రోత్సాహకాలు అందించడంలేదు. వ్యాపారులు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం ద్వారా పగటి పూట చాలా వరకు విద్యుత్ కొనుగోలుకు తగ్గించుకునే అవకాశం ఉంది. కానీ ప్రభుత్వం ఈ దిశగా అడుగులు వేయడం లేదు. మారిన పరిస్థితుల్లో బొగ్గు ధరలు పెరిగిన నేపథ్యంలో పగటి సమయంలో ఉన్న డిమాండ్‌కు అనుగుణంగా యూనిట్ రూ.10నుంచి13వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నామని చెబుతున్న అధికారులు ప్రత్యామ్నాయ ఉత్పత్తికి అవకాశాలపై దృష్టి సారించడం లేదు.

ఏడాదిలో 10నెలల పాటు పగటి సమయంలో సూర్యరశ్మితో విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉంది. దీనిని గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల ఎక్కడ ఎక్కువ అవసరం ఉంటే అక్కడ వినియోగించుకునే పరిస్థితి కూడా ఉంటుంది. చాలా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలకు సోలార్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటుకు శ్రద్ధ చూపకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటన్నదీ అధికారులు వెల్లడించాల్సి ఉంది. ▶ 2లో

# పొట్టకూటి కోసం వెళ్లి మృత్యుగూటికి

- ఆటోను లారీ ఢీ కొట్టడంతో ఐదుగురు దుర్మరణం
- సంతమాగులూరు వద్ద ప్రమాదం - మృతులంతా గుంటూరు వాసులే
- మృతుల్లో క్యాటరింగ్ పనులు చేసే నలుగురు మహిళలు, ఒక యువకుడు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా


ప్రమాద స్థలి, ఆస్పత్రిలో మహిళల మృతదేహాలు, ప్రమాదానికి గురైన ఆటో

బాపట్ల జిల్లా సంతమాగులూరు వద్ద శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు, యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో నలుగురు తీవ్ర గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను 108 వాహనం ద్వారా నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మరో ఇద్దరు మహిళలు మృత్యువాతపడ్డారు. మృతులు గుంటూరు నగరం నల్లచెరువు, ఆదర్శ నగర్, గోరంట్ల ప్రాంతానికి చెందిన అలివేలు మంగ తాయారు (18), బెలిమెళ్ల కవిత (19) , పాల్తీనరి నాయక్ (19), బుర్రి మాధవి (35), తమ్మిశెట్టి తులసి (16)గా గుర్తించారు. వీరు ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఒక శుభకార్యంలో అతిథులను ఆహ్వానించడం, వారికి తినుబండారాలు, శీతల పానీయాలు అందించే పనికి ఒప్పందం చేసుకుని రూ.800 కూలీ మాట్లాడుకున్నారు. అందులో భాగంగా గుంటూరు నుండి బస్సులో బయలుదేరి శుక్రవారం సాయంత్రానికి శుభకార్యంలో పాల్గొనేందుకు బయలుదేరి వెళ్లారు. శుక్రవారం రాత్రి శుభకార్యం ముగిసిన అనంతరం మార్కాపురం నుండి నరసరావుపేట వరకు ఆటో మాట్లాడుకొని తిరిగి వస్తున్న క్రమంలో తెల్లవారుజామున వర్షం తీవ్రతకు రోడ్డు మార్గం కనిపించకపోవడంతో ఎదురుగా లారీ ఢీకొనడంతో ప్రమాదం వాటిల్లింది. ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురిలో ఐదుగురు చెందారు. ఘటనా స్థలానికి బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ▶ 2లో

## అదనపు ఫీజుల వసూలు తగదు

- ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తే తక్షణం చర్యలు
- 303 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు
- ప్రజాశక్తితో జిల్లా కో-ఆర్డినేటర్ జయరామకృష్ణ

8 లో

## టిడిపి నాయకుడు నాగేంద్ర నిర్బంధం

- పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ వేధింపులు
- భృగుబంధ వద్ద పోలీసు వాహనాన్ని అడ్డిగించిన భార్య, బంధువులు

2 లో

# నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు విస్మరించారు

ప్రజాశక్తి-గుంటూరు


సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు మరిచి, ఉపాధి అవకాశాలను నిర్వీర్యం చేసే చర్యలు చేపడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు విమర్శించారు. ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సిపిఎం సమర భేరి కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో నిరుద్యోగ సమస్యపై రౌండ్‌టేబుల్ సమావేశం సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ అధ్యక్షతన నిర్వహి ంచారు. సమావేశంలో వివిధ విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. పాశం రామారావు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన మోడీ, రెండులక్షల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదని, మరోవైపు నిరుద్యోగ సమస్య తాండవిస్తోందని అన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలో అధిక జీతాలున్న ఉద్యోగుల్ని తొలగిస్తు న్నారన్నారు. అగ్నిపథ్ పేరుతో భారత సైన్యంలో పర్మినెంట్ నియామకాలు లేకుండా నాలుగేళ్ల కాలానికి నియా మకాలు చేపడుతు న్నారన్నారు. భవన నిర్మాణ మెటీరియల్ ధరలు పెరగటంతో భవన నిర్మాణ కార్మికు లకు పనుల్లేక ఇబ్బంది పడుతున్నారని, యంత్రాల వాడకం వల్ల వ్యవసాయ రంగంలో కూలీలకు ఉపాధి తగ్గిపో యిందని చెప్పారు. వంద రోజులకు మించి పని ఉండట్లేదని, వలసలు పోతున్నారని అన్నారు. చిన్నచిన్న పరిశ్రమలు మూతపడుతున్నాయని, నిరుద్యోగ సమస్యతో ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోందని, పారిశ్రామిక ఉత్పత్తుల కొనుగోలు నిలిచిపోతాయని, ఫలితంగా సంక్షోభం వస్తుందని వివరించారు. కావున నిరుద్యోగ సమస్యపై ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కె.నళినీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ ఇస్తామని, ▶ 2లో




## వాననీటితో ఎత్తిపోతలకు జల కళ

ప్రజాశక్తి - విజయపురిసౌత్

శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎత్తిపోతల జలపాతం ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో చూపరులకు ఆహ్లాదకరంగా మారింది. చుట్టూరా కొండలు, పచ్చనిచెట్లు వాటి మధ్యలో నీళ్లని చూస్తూ పర్యాటకులు పులకిస్తున్నారు. నాగార్జునసాగర్ నుండి మాచర్ల మార్గంలో 11 కిలోమీటర్ల దూరంలో తాళ్లపల్లి వద్ద 70 అడుగుల ఎత్తున్న ఈ జలపాతం కృష్ణా నది ఉపనది అయిన చంద్రవంక నదిపై ఉంది. చంద్రవంక నది నల్లమల శ్రేణుల తూర్పు కొండలలో ముటుకూరు వద్ద పుట్టి, తుమ్మకోట అభయారణ్యంలో తాళ్లపల్లి వద్ద 70 అడుగుల ఎత్తునుండి పడి ఉత్తర దిశగా ప్రయాణించి, తుమ్మకోటకు వాయవ్యాన కృష్ణా నదిలో కలుస్తుంది. ఇక్కడ మొసళ్ల పెంపక కేంద్రం ఉంది.

## నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు విస్మరించారు

(మొదటి పేజీ తరువాయి)

క్రమం తప్పకుండా డిఎస్‌సి ద్వారా ఖాళీ పోస్టులు భర్తీ చేస్తామని వాగ్దానాలు చేసి విస్మరించిందన్నారు. సచివాలయ ఉద్యోగాలు తప్ప ఇతర ఉద్యోగాల ఊసే లేదని, ఈ ప్రభుత్వం వచ్చాక ఒక్క డిఎస్‌సి కూడా విడుదల చేయలేదని అన్నారు. మోడీ ప్రభుత్వం కొత్త ఉద్యోగాలు కల్పించకపోగా ఉన్న పరిశ్రమలు మూతవేస్తూ నిరుద్యోగం మరింత పెంచుతోందని విమర్శించారు. డివైఎఫ్‌ఐ జిల్లా కన్వీనర్ వై.కృష్ణకాంత్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు కల్పించాలనే ఆలోచనే చేయట్లేదన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే కేంద్ర ప్రభుత్వ శాఖలో 10 లక్షలు, ఒక్క రైల్వేలోనే 3 లక్షలు ఖాళీలున్నాయని చెప్పారు. ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వలీ మాట్లాడుతూ కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మంచి నిరుద్యోగుల్ని మోసం చేశారన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ మాట్లాడుతూ పాఠశాలలు మూసివేస్తూ టీచర్ పోస్టుల ఖాళీలు భర్తీ చేయట్దేన్నారు. సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు, ఆవాజ్ జిల్లా అధ్యక్షులు బాషా, ఐద్వా నగర కార్యదర్శి కల్యాణి, సిఐటియు నగర పశ్చిమ కార్యదర్శి బి.ముత్యాలరావు తదితరులు ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నగర ప్రధాన కార్యదర్శి షేక్.ఖాసింవలి, ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సీతారామయ్య, ఆటో డ్రైవర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.శంకర్రావు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు టి.శ్రీనివాసరావు, సిఐటియు తూర్పు నగర కార్యదర్శి కె.శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు ఆది నికల్సన్, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి, మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు పి.శ్రీనివాసరావు, సిఐటియు పశ్చిమ నగర అధ్యక్షులు బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

### సోలార్ ప్లాంట్ల సబ్సిడీకి మంగళం

(మొదటి పేజీ తరువాయి)

గుంటూరులో ఇప్పటికే ట్రాఫిక్ సిగ్నల్స్‌కు, కలెక్టరేట్, నగరపాలక సంస్థ, ఇతర కార్యాలయాల్లో సోలార్ విద్యుత్‌ప్లాంట్లు ఉన్నాయి. కలెక్టరేట్‌లో 80 కిలో వాట్ల సామర్థ్యంతో ప్లాంటు పని చేస్తోంది. ఈ ప్లాంటు 30 ఏళ్లపాటు పనిచేస్తుంది. అలాగే కొంతమంది ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వైద్యులు తమ ఆస్పత్రుల్లో ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటున్నారు. సంగంజాగర్లమూడి వద్ద కార్పొరేషన్ వాటర్‌వర్క్సుకు కూడా సోలార్ ప్లాంట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే కొంత మంది ఇళ్లకు కూడా సోలార్ కనెక్షన్లు తీసుకున్నారు. ఎక్కువ మంది సోలార్ కనెక్షన్లు తీసుకునే విధంగా విద్యుత్ శాఖ అధికారులు తగిన ప్రోత్సాహం ఇవ్వడం లేదని విమర్శలు వస్తున్నాయి.

### పొట్టకూటి కోసం వెళ్లి మృత్యుగూటికి

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించారు. ప్రత్యక్ష సాక్షులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదానికి కారణమైన లారీని, గురైన ఆటోను పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఆటోను తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నుండి మార్కాపురం వైపు ఇడ్లి రవ్వ లోడుతో వెళుతున్న లారీ ఢీ కొట్టిందన్నారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పరారీలో ఉన్న లారీ డ్రైవర్, క్లీనర్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామన్నారు. మృతదేహాలను నరసరావుపేట ఏరియా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇదిలా ఉండగా ఘోర ప్రమాదం చోటుచేసుకున్నా మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు ప్రభుత్వం నుండి ప్రకటనేమీ రాలేదని కుటుంబీకులు వాపోతున్నారు. పొట్టకూటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లి ప్రమాదాలకు గురి కావడం బాధాకరమని, ఎంతో భవిష్యత్ ఉన్న 20 ఏళ్లలోపు వారూ మృతి చెందడం బాధాకరమని స్థానికులు ఆవేదనకు గురయ్యారు.

# టిడిపి నాయకుడు నాగేంద్ర నిర్బంధం

- పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ వేధింపులు
- భృగుబంధ వద్ద పోలీసు వాహనాన్ని అడ్డగించిన భార్య, బంధువులు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**

పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన టిడిపి నాయకుడు దండా నాగేంద్రను పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకుని వేధింపులకు గురిచేస్తున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపించారు. అమరావతి పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు సాగుతున్న వైనంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో అమరావతి మండలం ధరణి కోటకు చెందిన నాగేంద్ర కేసు దాఖలు చేశారు. ఇసుక తవ్వకాల్లో అక్రమాలు నిర్ధారణ కావడంతో రాష్ట్రంలో తవ్వకాలపై నిషేధం విధించడంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.100 కోట్ల జరిమానా విధించారు. ఈ నేపథ్యంలో నాగేంద్రపై అట్రాసిటీ కేసులు పెట్టారని కుటుంబ సభ్యుల ఆరోపించారు. ఇసుక ర్యాంప్‌లలో డ్రోన్ ఎగురవేశారని పోలీసులు కేసునమోదు చేశారని తెలిపారు. అమరావతి నుంచి సత్తెనపల్లి, ముప్పాళ్ల తదితర పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిప్పుతూ హింసిస్తుండగా నాగేంద్ర బంధువులు, భార్య భృగుబండ వద్ద పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. నాగేంద్ర భార్య పోలీసు వాహనానికి అడ్డుగా కూర్చొని నిరసన తెలిపారు. ఆమెను పక్కకు తొలగించి వాహనం ముందుకు వెళ్లింది. అమరావతికి చెందిన దండా నాగేంద్ర అరెస్ట్‌ను మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు ఖండించారు. రాష్ట్రంలో రూ.40 వేల కోట్లు ఇసుక అక్రమ మైనింగ్ జరిగిందన్నారు. ఎన్‌జిటి తీర్పునకు విరుద్ధంగా ఇసుక తవ్వకాలు చేస్తున్న వైసిపి నాయకులు ఫిర్యాదు చేసిన వారిపై తప్పుడు కేసులు పెట్టడం ఏమిటని మీడియాతో మాట్లాడుతూ ప్రశ్నించారు. దండా నాగేంద్రను వెంటనే విడుదల చేయాలని, అతనికి ఏమైనా జరిగితే ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, పోలీసు అధికారులు బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.



# సామూహిక రాయబారానికి తరలిరండి

**ప్రజాశక్తి - పల్నాడు జిల్లా**

మెమో నెం. 1214 రద్దుచేసి భవన నిర్మాణ కార్మికులకు లబ్ధి చేకూర్చాలని, దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంత్రుల వద్దకు సామూహిక రాయబారం కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ అన్నారు. ఈ మేరకు సామూహిక రాయబారం కార్యక్రమం జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రం రొంపిచర్ల, మర్రిచెట్టుపాలెం, విప్పర్ల గ్రామాల్లో ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. గ్రామంలో తిరిగి భవన నిర్మాణ కార్మికుల ఇళ్లకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సిలార్ మసూద్ మాట్లాడుతూ పెండింగ్ క్లైములను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 5న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వినతిపత్రం ఇచ్చేందుకు భవన నిర్మాణ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు పి.కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, కార్యదర్శి బి.బాలకోటయ్య, చందు, ఖాదర్ మస్తాన్, జానీ పాల్గొన్నారు.

# బోగస్ ఓట్లతో ఫలితాలు తారుమారు

**ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి**




బోగస్ ఓటర్లు ప్రజాస్వామ్య ప్రక్రియను అపహాస్యం పాల్జేస్తున్నారని, వారు ఎన్నికల ఫలితాలను కూడా తారుమారు చేస్తున్నారని పలు పౌర సంఘాల నేతలు అన్నారు. స్థానిక మహాత్మాగాంధీ కళాశాలలో ఆంధ్రా ఆడ్వకేట్స్ ఫోరం ఆధ్వర్యంలో 'బోగస్ ఓట్ల నివారణ, రాజకీయ పార్టీల బాధ్యత" అనే అంశంపై ఆదివారం సదస్సు జరిగింది. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన రాష్ట్ర ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.వి.ఆర్. కృష్ణంరాజు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో ఈ బోగస్ ఓటర్లు 2014 ఎన్నికల్లో ప్రజాతీర్పును తారుమారు చేసినట్లుగా బెటర్ ఆంధ్రప్రదేశ్ సంస్థ అధ్యయనంలో తేలిందన్నారు. 2014 అసెంబ్లీ ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ లక్షలాది బోగస్ వోట్లు చేర్పించిందని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆరోపించిందని, దీనిని పరిశీలించి ఎన్నికల కమీషన్ ఎన్నికల అనంతరం 2015లో సుమారు 30 లక్షల బోగస్ వోట్లను తొలగించిందని కృష్ణంరాజు తెలిపారు. ఆ ఎన్నికల్లో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కేవలం ఆరు లక్షల వోట్ల తేడాతో అధికారానికి దూరమైందని ఆయన చెప్పారు. బహుశా ఈ ఓటమికి బోగస్ వోట్లు కారణం కావచ్చని కష్ణంరాజు అభిప్రాయ పడ్డారు.అడ్వకేట్స్ ఫోరం కన్వీనర్, హైకోర్టు న్యాయవాది బి.అశోక్ కుమార్, ఫోరం ఫర్ బెటర్ సొసైటీ జిల్లా కన్వీనర్ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎడిటర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎం. కోటేశ్వరావు, గుంటూరు ఏసీ కళాశాల మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ ఈ ముత్యం,ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డీన్ ప్రొఫెసర్ ఈ శ్రీనివాసరెడ్డి,స్వచ్ఛ పాలిటిక్స్ వన్ టూ త్రీ కన్వీనర్ బడే జానీ, సీనియర్ జర్నలిస్టు నిమ్మ రాజు చలపతిరావు పాల్గొన్నారు.



### పలుచోట్ల సమరభేరి ప్రచారం

**ప్రజాశక్తి - పెదకూరపాడు**

తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం పల్నాడు జిల్లా నాయకులు జి.మల్లేశ్వరి కోరారు. ఈ మేరకు నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో సిపిఎం సమరభేరి ప్రచారం చేశారు. కరపత్రాలు పంపిణీతోపాటు సమస్యలపై ప్రజల నుండి సంతకాలు సేకరించారు.




**ప్రజాశక్తి - మాచర్ల**

పట్టణంలోని నిర్వహించిన ప్రచారంలో సిపిఎం నాయకులు బి.మహేష్ మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ప్రజలపై తీవ్ర భారాలు మోపుతున్నాయని చెప్పారు. ధరలు పెరిగి ప్రజల జీవనం కష్టంగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం నిర్వహించే పోరాటాల్లో కలిసి రావాలని పిలుపునిచ్చారు. నాయకులు జ్యోతిష్‌రాజు, రమణ పాల్గొన్నారు.



### గోలి వాగుపై రూ.9 కోట్లతో హైలెవల్ బ్రిడ్జి

**ప్రజాశక్తి - రెంటచింతల**

మండల కేంద్రమైన రెంటచింతలలోని గోలి వాగుపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు రూ.9 కోట్లు కేటాయించారని, ప్రస్తుతం డైవర్షన్ రోడ్డు నిర్మాణం జరుగుతోందని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ నిధులన్నీ 167 ఏడి జాతీయ నిర్మాణంలో భాగమన్నారు. రెంటచింతలకు ఆదివారం వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. బ్రిడ్జి వల్ల ప్రమాదాలను నియంత్రించొచ్చని, వాగుపై 90 మీటర్ల పొడవు, పది మీటర్ల వెడల్పుతో ఐదు కానాలు ఏర్పాటు చేస్తారని చెప్పారు. ఎమ్మెల్యే వెంట ఎంపిపి డి.చౌడేశ్వరి, మాజీ జెడ్‌పిటిసి భాస్కర్‌రెడ్డి, ఉమామహేశ్వర్‌రెడ్డి ఉన్నారు.

### పులివెందులకు దీటుగా అభివృద్ధి

**ప్రజాశక్తి - పిడుగురాళ్ల**

పులివేందులకు దీటుగా గురజాల అభివృద్ధి చెందుతుందని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని భవనాశి యల్లారావు కల్యాణ మండపంలో సచివాలయ కన్వీనర్లకు అవగాహన ఆదివారం సదస్సును నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టి పల్నాడు జిల్లాలోని ప్రతి మండలం అర గంటలో హైవే ఎక్కి ఎక్కడికి కావాలంటే అక్కడికి వెళ్లవచ్చునని అన్నారు. గురజాల నియోజకవర్గాన్ని 3500 కోట్లతో అభివృద్ధి చేశామని, చెప్పారు. దీనిపై కావాలంటే ఎవరైనా చర్చకు రావొవ్వని చెప్పారు.

# పలుచోట్ల భారీ వర్షం.. స్తంభించిన జనజీవనం

**ప్రజాశక్తి - మాచర్ల**

మాచర్ల పరిసర ప్రాంతాలలో శనివారం అర్ధరాత్రి నుండి తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది 81 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనది ఈ మధ్యకాలంలో విపరీతమైన ఎండలు ఉక్క పోత తో అల్లాడుతున్న ప్రజలకు సేదతీరినట్లు అయింది కుంటలు మడుగులు రాత్రి కురిసిన వర్షానికి నిండాయి ఆగస్టు నెలలో వర్షం కోసం ఎదురుచూసిన రైతులకు రాత్రి కురిసిన వర్షం ఎంతో ఉపయోగపడుతుందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు మిరప ముక్కలు నాటుకునే వారికి ఈ వాన ఎంతో మేలు చేస్తుంది అంటున్నారు


అచ్చంపేటలో..


విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వర్షపునీరు

**ప్రజాశక్తి-అచ్చంపేట**

అచ్చంపేట మండలంలో శనివారం అర్ధరాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షం లోతట్టు ప్రాంతాలన్నీ జలమయం అచ్చంపేట మాదిపాడు రోడ్డులో రోడ్డుపై ప్రవహిస్తున్న వర్షాపు నీరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌షేషన్ చుట్టూ ముట్టిన వరద నీరు భారీగా వచ్చి చేరింది అంతేకాకుండా మాదిపాడు రోడ్డు ప్రధాన రహదారిపై వర్షపు నీరు పోయే మార్గం లేక నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది మాదిపాడు రోడ్డులోని రహదారి వెంపటి కొందరు అక్రమ దారులు కం దా కాలను పూడ్చి వేసుకొని వాటిపై రేకుల షెడ్లు నిర్మించడంతో వర్షపు నీరు పోయే మార్గం లేక రోడ్డుపైన నిలిచిపోయింది రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడం లేదని సమీప గహాల వారు ఆరోపిస్తున్నారు పంచాయతీ అధికారులు కాళీ ప్రదేశంలో గండి కొట్టి నీటిని తరలించారు ఒక మోస్తరు వర్షం పడితే ఈ ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచిపోతుంది అధిక మోతాదులో నీరు వచ్చినప్పుడు తాత్కాలిక పరిష్కారమే కానీ ఆర్ అండ్ బి, అధికారులు , రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కార చూపకపోవడం సమీప నివాస గహాల వారు ఆరోపిస్తున్నారు


రెంటచింతల లోని పశువైద్యశాల...

## పొంగి న గోలి వాగు

### 136 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు


రెంటచింతల లోని గృహాల్లోకి చేరిన వర్షపు నీరు

**ప్రజాశక్తి - రెంటచింతల**

మండల కేంద్రమైన రెంటచింతలలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి గోలి వాగు పొంగి పొర్లడంతో మాచర్ల,గుంటూరు ప్రధాన రహదారిపై రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించి పోయింది రెంటచింతలలోని బీసీ కాలనీ పశు వైద్యశాల నీట మునిగింది. గృహాల్లోకి నీరు చేరింది ఇప్పటివరకు వర్షాలు లేక ఇబ్బందులు పడుతున్న రైతులు 136 మీ మీ వర్షపాతం నమోదు కావడంతో కొంత ఉపశమనం కలుగుతుందని భావిస్తున్నారు.

## లబోదిబోమంటున్న వ్యాపారులు

**ప్రజాశక్తి-పొన్నూరు రూరల్**

గత శనివారం రాత్రి పొన్నూరు పట్టణంలో భారీ వర్షం కురిసింది. 137.2 వర్షపాతం నమోదయిందని అధికారులు వెల్లడించారు. పొన్నూరు పట్టణంలో ఇటీవల రోడ్డు విస్తరణ అభివృద్ధి పనులు చేపట్టి కనీసం మౌలిక వసతులు కల్పించకపోవడంతో తోటమ్మ తల్లి గుడి దగ్గర కళాంజలి వస్త్ర దుకాణంలో పూర్తిగా నీరు చేరి సుమారు రూ.20 లక్షల విలువైన వస్త్ర సామాగ్రి మునిగిపోయాయని దుకాణ యజమానులు లబోదిబోమంటున్నారు.


పొన్నూరులోని దుకాణాల్లోకి చేరిన వర్షపు నీరు



## లారీ ఢీకొని యువకుడి మృతి

**ప్రజాశక్తి - తాడికొండ**

లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన ఆదివారం మండలంలో పరిధిలోని పొన్నెకల్లు గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తాడికొండ గ్రామానికి చెందిన బొబ్బిలి రాజకుమార్, మరొక యువకుడు కలిసి తన ద్విచక్ర వాహనంపై పొన్నెకల్లు నుండి తాడికొండ వస్తుండగా, వెనుక వస్తున్న లారీ ఢీ కొట్టింది. యువకుడిపై నుండి వాహనం వెళ్లగా ఘటనా స్థలంలోనే మృతి చెందాడు, మరొకరికి స్వల్ప గాయలయ్యాయి. స్థానికులు 108 కు సమాచారం అందించగా చికిత్స నిమిత్తం జిజిహెచ్ కు తరలించారు. మృతుడికి భార్య ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృత దేహన్ని జి జి హెచ్ కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ పరారిలో ఉన్నట్లు తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసులు దాడి

**ప్రజాశక్తి-నకరికల్లు**

పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం రూపెనగుంట గ్రామంలో పొలాల్లో పేకాటుతున్న వారిపై దాడి చేసి 9 మంది అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 26, 570 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా తన దష్టికి తీసుకువస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.




# ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్ పై దాడి అవాస్తవం : డీఎస్పీ

**ప్రజాశక్తి-సత్తెనపల్లి టౌన్**

ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్‌పై గ్రామస్తులు దాడి చేశారని ఎస్. ఐ పై భోతిక దాడి చేశారని , తాము గ్రామస్తులు పై లాఠీ ఛార్జ్ చేశామని అంటూ వస్తున్న వార్తలు అవాస్తం అని, ఎంత మాత్రం నిజం లేదని పట్టణ డీఎస్పీ బి. ఆదినారాయణ తెలిపారు. ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్లో తన సిబ్బందితో కలిసి జరిగిన ఘటన పై పూర్తి వివరాలు తెలిపారు. ఈ నెల 1వ తేదిన ముప్పాళ్ళ మండలం బొల్లారం గ్రామానికి చెందిన ఈపూరి వెంకటేశ్వర రెడ్డి తన మిత్రుడితో కలసి బొల్లారం నుండి నరసరావుపేటకు ఓ వివాహం నిమిత్తం వెళుతుండగా, మార్గమధ్యంలో రెండు మోటర్ బైక్ లు రోడ్డుగా అడ్డంగా పెట్టి వుండటాన్ని వారు గమనించి, కారు ఆపి చూడగా ఇద్దరు యువకులు కనిపించారని అన్నారు. బైక్ లు ఎందుకు అడ్డంగా ఆపారని వారిని ప్రశ్నించగా వారు దురుసుగా మాట్లాడుతూ ఊహించని విధంగా వెంకటేశ్వర రెడ్డి పై భౌతిక దాడికి పాల్పడ్డారని చెప్పారు. అనంతరం వెంకటేశ్వర రెడ్డి ముప్పాళ్ళ పోలీసులకు ఫిర్యాదు చేశారని, ఈ నేపథ్యంలో ముప్పాళ్ళ పోలీసులు కేసును నమోదు చేసి అందుకు బాధ్యులైన ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. కాగా , వెంకటేశ్వరరెడ్డి పై దాడి విషయం తెలుసుకున్న గ్రామస్తులు ఆగ్రహావేశాలతో ముప్పాళ్ళ పోలీస్ స్టేషన్ కు వచ్చారని, ఈ విషయం ముప్పాళ్ళ ఎస్ ఐ తనకు సమా చారం అందివ్వడంతో ఎటువంటి బలగాలను వెంటబెట్టు కొని వెళ్ళ లేదని కేవలం తమ డ్రైవర్లు , రూరల్ సిఐతో వెళ్లినట్లు చెప్పారు. తాను అక్కడికి వెళ్లి గ్రామస్తులతో మాట్లాడి పంపించానని, గ్రామస్తులు స్టేషన్ పై దాడిచేసి ఎస్ ఐ పై భౌతిక దాడికి పాల్పడారనేది అవాస్తమని అన్నారు. ఇది చాలా చిన్న విషయం అని ఇలాంటి ఘట నలు ఇంతవరకు జరగలేదని అన్నారు . ఈ ఘటనకు పాల్పడిన రావూరి సాయికృష్ణ , జి.శ్రీనులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నామని, వీరిద్దరు పట్టణానికి చెందిన వారేనని చెప్పారు. ఈ కేసుపై ఇంకా విచారణ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రజలు ఇలాంటి వదంతులను నమ్మొద్దని సూచించారు. సమావేశంలో సిఐ లు శోభన్ బాబు ప్రేమయ్య , ముప్పాళ్ళ ఎస్ ఐ డి కిషోర్ బాబు ,రఘుపతి వున్నారు .


మాట్లాడుతునన సత్తెనపల్లి పట్టణ డీఎస్పీ బి. ఆదినారాయణ

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ విద్య

## మదర్ థెరిస్సాను స్ఫూర్తిగా తీసుకోవాలి

**అనన్య హాస్పిటల్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ**

**ఆస్పత్రి ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్యశిబిరం**

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

సేవకు ప్రతిరూపం సెయింట్ మదర్ థెరిస్సా అని అనన్య హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ అన్నారు. సెయింట్ మదర్ థెరిస్సా విగ్రహ నిర్మాణ కమిటీ, అనన్య హాస్పటల్స్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా 113వ జయంతి సందర్భంగా జరుగుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం నరసరావుపేట పల్నాడు బస్టాండ్‌లోని అనన్య హాస్పటల్‌లో నరసరావుపేట పరిధిలోని వివిధ వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు ఉచిత మెగా వైద్యశిబిరం ఆదివారం నిర్వహించారు. తొలుత మదర్ థెరిస్సా చిత్రపటానికి డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, డాక్టర్ సింగరాజు విద్య పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ వృద్ధాశ్రమాల నుండి వచ్చినవారికి వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ సాయికృష్ణ మాట్లాడుతూ యుగోస్లోవియా దేశం నుండి భారతదేశానికి వచ్చిన మదర్ థెరిస్సా కలకత్తాలోని మురికివాడలలో నివసిస్తూ అనారోగ్యపాలైన అనాథలను, వృద్ధులను చూసి చలించిపోయారని, వారందరికీ వైద్య సేవలందించారని, కుష్టు రోగులకు కూడా ఎంతో సేవలందించారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ మదర్ థెరిస్సాను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అనన్య హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ సింగరాజు విద్య మాట్లాడుతూ సింగరాజు ఫౌండేషన్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. పల్నాడు బస్టాండ్‌లో హాస్పిటల్ ఎదుట సింగరాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత శుద్ధనీటిని శాశ్వత ప్రాతిపదికన అందుబాటులో ఉంచామని చెప్పారు. కార్యక్రమంలో కంచుపర్తి సత్యనారాయణ మాస్టర్, తెలుగు సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ గోదా రమేష్ కుమార్, ఆశ్రమాల నిర్వాహకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డికి అవార్డు

ప్రజాశక్తి-పెదకూరపాడు



మండలంలోని 75 త్యాళ్ళూరు జెడ్‌పి పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డికి విద్యా రంగంలో విశిష్ట కృషి చేస్తున్నందుకు గాను జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నల్లగొండకు (తెలంగాణ) చెందిన 'పుడమి సాహితీ వేదిక' డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక జాతీయ పురస్కారాన్ని ఆదివారం అందించారు. విద్యారంగంలో 27 ఏళ్లుగా విశిష్ట సేవ చేస్తున్నందుకు శ్రీనివాసరెడ్డికి ఈ పురస్కారాన్ని ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. పురస్కారాన్ని శ్రీనాథ మహాకవి 13వ తరం వారసులు డాక్టర కె.శ్రీనివాసశర్మ, భక్త రామదాసు10వ తరం వారసులు కంచర్ల శ్రీనివాసరావు, కవయిత్రి మొల్ల 14వ తరం వారసులు ఎం.శివశంకరయ్య, గిడుగు వెంకట రామమూర్తి 4వ తరం వారసులు వెంకట నాగేశ్వరరావు ప్రదానం చేశారు. శ్రీనివాసరెడ్డిని పీసి చైర్మన్ జి.శ్రీనివాసరెడ్డి, గుంటూరు, పల్నాడు జిల్లాల ప్రధానోపాధ్యాయ సంఘ అధ్యక్షులు ఎ.తిరుమలేష్, ఆర్.శ్రీనివాసరెడ్డి, విద్యావేత్త బి.శివరామయ్య, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

# విద్యారంగ సమస్యలకు ప్రాధాన్యం

- **జిపిఎస్‌ను అంగీకరించేది లేదు : యుటిఎఫ్**
- **విద్యాశాఖ కార్యదర్శి తీరు మార్చుకోకుంటే ఉద్యమం**

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం, ఆ క్రమంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం సామాజిక స్పృహతో పని చేయడం యుటిఎఫ్ లక్ష్యమని, ఆ తర్వాతే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ అన్నారు. యుటిఎఫ్ జిల్లా కమిటీ సమావేశం జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా ప్రధాన కార్యదర్శి జి.విజయసారథి అధ్యక్షత వహించారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో పాఠశాల విద్యారంగం పరిస్థితి ఆశాజనకంగా లేదని, గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా 46 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించగా ఈ ఏడాది 39 లక్షలకు పడిపోయిందని ఆవేదన వెలిబుచ్చారు. ప్రభుత్వం నాడు-నేడు ద్వారా పాఠశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి అమ్మఒడి, విద్యా దీవెన, విద్యా కానుక, అంటూ పథకాలు ప్రవేశ పెట్టినా విద్యార్థులను తల్లిదండ్రులను ఆకర్షించడంలో విఫలమైందన్నారు. ఇదే సమయంలో ఉపాధ్యాయుల పట్ల ప్రభుత్వం వైఖరి ఇబ్బందికరంగా ఉందని, కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. బదిలీ ఉపాధ్యాయులకు 3 నెలలుగా క్యాడర్ స్ట్రెన్త్ అంటూ వేతనాలు ఇవ్వలేదని, రెండు దశాబ్దాల కాలంలో ఎప్పుడూ ఇటువంటి పరిస్థితి చూడలేదని అన్నారు. విద్యారంగంలో అనేక సంస్కరణలను ప్రభుత్వం తెచ్చిందని, ఆంగ్ల మాధ్యమంలో బోధించాలని ఒత్తిడి చేస్తోందని, అయితే ఉపాధ్యాయులకు శిక్షణివ్వకుండా విద్యార్థులు సమర్థవంతంగా పాఠాలు చెప్పడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో అంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందించాలనే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను ఆహ్వానిస్తున్నామని, దీనికి సంబంధించి ఉపాధ్యాయులకు తర్ఫీదు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పల్నాడు జిల్లా పర్యటనలో భాగంగా విద్యార్థుల ముందే ఉపాధ్యాయులను దూషించారని, అవమానకరంగా మాట్లాడారని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రవీణ్ ప్రకాష్ తనతీరు మార్చుకోకపోతే యుటిఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. పని సర్దుబాటు పేరిట రాజకీయ బదిలీలు జరుగుతున్నాయని, పల్నాడు జిల్లాలో 147 మంది ఉపాధ్యాయులకు సీఎంవో పేషీ నుండి బదిలీలు జరిగాయని, ఆ 147 మంది ఉపాధ్యాయులను పల్నాడులో పని చేయాలని చెప్పాల్సిన మంత్రులు, ఎమ్మెల్యేలు ఇష్టారీతిగా గుంటూరు, విజయవాడ వంటి ప్రాంతాలకు బదిలీ చేయడం వలన పల్నాడు విద్యారంగానికి నష్టం జరుగుతోందని వివరించారు. పల్నాడు జిల్లాలో రెండున్నర దశాబ్దాలుగా ఉపాధ్యాయుల కొరత ఉందని, ప్రభుత్వం ఇప్పటికైనా భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన బదిలీలలో పల్నాడు జిల్లాలో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉన్నారని సంతోషం వెంటనే ఆవిరి అయిపోయిందన్నారు. జెడ్‌పి పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత ఉందన్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ జిల్లా నుండి మరో జిల్లాకు బదిలీ చేయడం విద్యార్థి పట్ల సమాజం పట్ల ఉన్న బాధ్యత తేటతెల్లం అవుతుందన్నారు. ఉపాధ్యాయుల అక్రమ బదిలీలు నిలిపివేయాలని, ఖాళీలను భర్తీ చేసేందుకు ప్రజాప్రతినిధులు ప్రయత్నం చేయాలని కోరారు. ఈ నెల 9న యుటిఎఫ్ రాష్ట్ర జాత నెల్లూరు, ఒంగోలు నుండి పల్నాడు జిల్లాలో ప్రవేశిస్తుందని ప్రచార జాతాకు స్వాగతం పలికి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పి.ప్రేమ్‌కుమార్ తదితరులు

విజయసారథి మాట్లాడుతూ జిపిఎస్‌ను యుటిఎఫ్ అంగీకరించదని, పాత పెన్షన్ విధానం అమలు చేయాల్సిందేనని స్పష్టం చేశారు. సిపిఎస్‌కు బదులుగా జిపిఎస్ విధానాన్ని అమలుకు ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశలను నీరుగార్చిందన్నారు. సిఎం ఇచ్చిన హామీ అమలు కాకపోవడం అత్యంత బాధాకరమన్నారు. సిపిఎస్ రద్దుపై నాలుగే ఏళ్ల కాలయాపన చేసి ఇప్పుడు కంటి తుడుపు చర్యగా జిపిఎస్ విధానాన్ని అమలు చేస్తామండడం ఉద్యోగ, ఉపాధ్యాయులు మరోసారి వంచిచడమేనన్నారు. జిపిఎస్‌లో ఉద్యోగుల కాంట్రిబ్యూషన్ ఉందని, షేర్ మార్కెట్ లాభనష్టాలతో ఉద్యోగుల పెన్షన్ ఆధారపడి ఉంటుందని తెలిపారు. షేర్ మార్కెట్‌పై ఆధారపడి వచ్చే పెన్షన్‌కు సామాజిక భద్రత ఎలా ఉంటుందో ప్రభుత్వమే సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు ముఖ ఆదారిత హాజరు బోధనేతర పనులకు సెల్‌ఫోన్ ద్వారా చేయాల్సి ఉంటుందని అటువంటి పరిస్థితులలో 9.30 తర్వాత ఉపాధ్యాయులు ఫోన్ లేకుండా ఉండడం ఎలా ప్రశ్నించారు. బోధన, పరీక్షలకు సంబంధించి అన్ని అంశాలను ఉపాధ్యాయులతో సంప్రదించకుండానే ప్రభుత్వం ఎలా నిర్ణయిస్తుందని నిలదీశారు. సమావేశంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, సహాధ్యక్షులు ఎం.మోహన్‌రావు, కోశాధికారి జెవిడి నాయక్ , ఎస్.సుందరరావు పాల్గొన్నారు.

# నేటి ధర్నాకు భారీగా తరలిరండి

**పలు చోట్ల సిపిఎం సమరభేరీ ప్రచారంలో నాయకుల పిలుపు**

చిలకలూరిపేట మండలం



ప్రజాశక్తి-చిలకలూరిపేట

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో చిలకలూరిపేట నియోజక వర్గంలో చేపట్టిన సమరభేరి ఆదివారం కొనసాగింది. మండల పరిధిలోని తాతాపూడి, మురికిపూడి, రాజాపేట, బొప్పుడి, గోపాలమవారిపాలెం, యడవల్లి, మద్దిరాల, ఈ.టి.కమ్మవారి పాలెం, కావురు తదితర గ్రామాల్లో ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ధర్నాకు ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సిపిఎం చిలకలూరిపేట పట్టణ కార్యదర్శి పి.వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. నాయకులు ఎం.విల్సన్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

పెరిగిన నిత్యవసర వస్తువులు ధరలు, పెట్రోలు, గ్యాస్, డీజిల్ ధరలు తగ్గించాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని సిపిఎం నాయకులు అవ్వారు ప్రసాద్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా ఆదివారం పట్టణంలోని 10, 21 వార్డులలో ఇంటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి డి.విమల, నాయకులు జె.రాజ్‌కుమార్, డి.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, హనుమంతరావు పాల్గొన్నారు.



సత్తెనపల్లి

ప్రజాశక్తి - వినుకొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజల జీవనం కష్టతరంగా మారిందని సిపిఎం పట్టణ కార్యదర్శి బోంకూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఈ మేరకు సమరభేరి వాల్‌పోస్టర్లను స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆవిష్కరించారు. కె.హనుమంతరెడ్డి, ముని వెంకటేశ్వర్లు, నాసర్‌బి, తిరుమల లక్ష్మి పాల్గొన్నారు.



వినుకొండ

# పాలకుల విధానాలతో ప్రజలకు ఇక్కట్లు

## వాడవాడలా సిపిఎం సమరభేరీ ప్రచారం - సమస్యలపై ఆందోళనలకు కదిలిరావాలని ప్రజలకు పిలుపు



పెదకాకాని సుందరయ్య నగర్‌లో మాట్లాడుతున్న వై నేతాజీ


కొల్లిపర మండలం దావులూరులో విద్యుత్ బిల్లులు పరిశీలిస్తున్న ఎన్ భావన్నారాయణ


మంగళగిరి సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎస్ చంగయ్య


తాడేపల్లిలో సిపిఎం సమరభేరీ ప్రచారం


తెనాలిలో మాట్లాడుతున్న బాబు ప్రసాద్


ఫిరంగిపురంలో వినతి పత్రం ఇస్తున్న బైరగాని శ్రీనివాసరావు తదితరులు

**ప్రజాశక్తి - పెదకాకాని రూరల్**

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యవసర వస్తువులు ధరలు విపరీతంగా పెరిగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై నేతాజీ తెలిపారు. ఆదివారం సిపిఎం ప్రచారభేరీ జాతాను పెదకాకాని సుందరయ్య నగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా వై నేతాజీ మాట్లాడుతూ పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెరిగాయన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేస్తున్నారని ఎల్ఐసి పోస్టల్ రైల్వే లాంటి సంస్థలు ప్రైవేటీకరణ చేశారని విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఎన్నికలు వస్తున్నాయి కాబట్టి సిలిండర్ పై రెండు వందలు తగ్గించి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారని గతంలో 400 ఉన్న గ్యాస్ సిలిండర్ ధర 1200 చేసి ఇప్పుడు 200 తగ్గించి ప్రచారం చేసుకుంటున్నారని రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న చట్టాలు ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్నారని దానికి ఉదాహరణ రైతుల పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రయత్నం చేస్తుందన్నారు. కరెంటు బిల్లులు విపరీతంగా పెంచారని ఎప్పుడో తీసుకున్న కనెక్షన్ లకు కూడా ఇప్పుడు డిపాజిట్లు చెల్లించాలని పేద ప్రజలపై పెద్ద మొత్తంలో బిల్లులు భారాలు మోపుతున్నారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విధానాలకు వ్యతిరేకంగా ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల మందికి ఇండ్ల స్థలాలు ఇచ్చామని చెబుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ భూముల్లో 20 సంవత్సరాలుగా నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని నివాసం ఉంటున్న సుందరయ్య కాలనీ స్వర్ణ పూరి కాలనీ శ్రీ లక్ష్మీ దుర్గ కాలనీ ఎన్టీఆర్ కాలనీ వడ్డెర కాలనీ జానస్పూర్ కాలనీలలో నివాసం ఉంటున్న వారికి పట్టాలు ఇవ్వలేదని వెంటనే ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కాలనీలలో రోడ్లు అధ్వానంగా గుంతలు మహిమ గా ఉన్నాయని సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణం చేయాలని మంచినీటి వసతి కల్పించాలని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సోమవారం ఉదయం 10 గంటలకు పెదకాకాని తాసిల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో జరిగే ధర్నా కార్యక్రమంలో పేద ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బురద గుంట సాంబయ్య కే రాఘవయ్య ఎం సాంబయ్య ఎం రాజేష్ లక్ష్మీ కాంతమ్మ వీరమ్మ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-మంగళగిరి**

బిజెపి అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల మందికి ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పి ప్రధానిగా తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ఉద్యోగాలు కల్పించలేకపోయారని సిపిఎం నాయకులు విమర్శించారు. ఆదివారం సాయంత్రం మంగళగిరి సిపిఎం కార్యాలయంలో సమరభేరి కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ నాయకులు పి మున్నా అధ్యక్ష వహించారు. సిపిఎం నాయకులు జీ రామన్న మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు పరిష్కారానికి ఎలాంటి నిర్ణయాలు తీసుకోవడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో 10 లక్షల పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నప్పటికీ నియమించడం లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో నరేంద్ర మోడీని ఇంటికి పంపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, నిరుద్యోగ యువత యువకులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ ఎస్ చంగయ్య, ఈమని అప్పారావు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి కూడా నిరుద్యోగులను మోసం చేశారని విమర్శించారు. డీఎస్సీ ఇంతవరకు వేయలేదని అన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉంటే కేవలం పదివేల మంది ఉద్యోగాలకే జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని విమర్శించారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, పి బాలకృష్ణ, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ గణేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎం బాలాజీ, కే శ్రీనివాసరావు, కే రవితేజ పాల్గొన్నారు.

**ప్రజాశక్తి-తాడేపల్లి :**నేడు తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఎం ఆధ్వర్యంలో జరిగే నిరసన కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు వేముల దుర్గారావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎమ్మెల రామయ్య కాలనీ జరిగిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నిత్యావసర సరుకుల ధరలు ప్రజలు కొనలేని విధంగా పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దళితులు, మైనార్టీలపై దాడుల పెరిగాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిజెపిని దించితేనే ఈ దేశానికి రక్ష అని చెప్పారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తోన్న బిజెపికి రాష్ట్రంలోని అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపి వంతపాడుతున్నాయని విమర్శించారు.

**ప్రజాశక్తి - తెనాలి**

ప్రజా సమస్యలు తెలుసుకుని ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి మారిస్ పేటలో కొనసాగింది. పట్టణ కార్యదర్శి కె బాబు ప్రసాద్ సారధ్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలు విన్నవించారు. సైడ్ కాలువలు సరిలేవని, దుర్గంధం, దోమల తీవ్రత అధికంగా ఉందన్నారు. అలాగే వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, ఆవుల సంచారం పెరిగిపోయిందని ప్రజలు బయటికి రావాలంటే భయపడే పరిస్థితి నెలకొందని చెప్పారు. విద్యుత్ చార్జీల పెంపుపై కూడా వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాబు ప్రసాద్ మాట్లాడుతూ మరో దఫా విద్యుత్ చార్జీల పెంపుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని దీన్ని తిప్పికొట్టేందుకు ప్రజలు సన్నద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో షేక్ హుస్సేన్ వలి, ఎన్ రాజ్యలక్ష్మి, పి చంద్రకళ, కె. రవికుమార్ పాల్గొన్నారు

**ప్రజాశక్తి-తెనాలి :**పెరుగుతున్న ధరలతో ఇబ్బంది పడుతున్నామని, వేళాపాళాలేని కరెంటు కోతల కారణంగా దోమలతో ప్రజానీకం అల్లాడిపోతున్నారని సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన సమర్భేరిలో ప్రజలు సమస్యలు ఏకరవు పెట్టారు కొల్లిపర మండలం దావులూరు లో ఆదివారం సమర్భేరిలో భాగంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్ భావన్నారాయణ, సీనియర్ నాయకులు ములకా శివ సాంబిరెడ్డి పర్యటించారు. ప్రజల సమస్యలను విన్నారు. జగనన్న కాలనీలలో నివేసిన స్థలాలు ఇచ్చినా ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థిక స్తోమత లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా భవన్నారాయణ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై 4వ తేదీన తహసిల్దార్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాకు ప్రజలు తరలి రావాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జిలుగు ముక్కంటి, కాబోతు అనూష, తదితరులు పాల్గొన్నారు

**ప్రజాశక్తి - ఫిరంగిపురం**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సిపిఎం ప్రచార భేరీ మండలంలో ప్రచారం నిర్వహించింది. ఫిరంగిపురంలోని సత్తెనపల్లి బస్టాండ్‌లో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలని కోరుతూ విద్యుత్ బిల్లులను దగ్ధం చేశారు. అనంతరం సచివాలయం 2 కార్యదర్శి మదమంచి శిరీషకి అర్జీ అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు కామ్రేడ్ బైరగాని శ్రీనివాసరావు, మండల కార్యదర్శి యస్.ఎం.వలి, గ్రామ కార్యదర్శి ఏ అంకమ్మ రావు, సిహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## నేడు తాడేపల్లికి శ్రీనివాసరావు రాక

**ప్రజాశక్తి-తాడేపల్లి**

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం పది గంటలకు తాడేపల్లి రానున్నారు. అధిక ధరలు తగ్గించాలని, నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంచాలని తదితర ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఇటీవల తాడేపల్లి పట్టణ, రూరల్ గ్రామాల్లో సిపిఎం సమరభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం తాడేపల్లి తహశీల్దార్ కార్యలయం ముందు జరిగే ధర్నా కార్యక్రమానికి శ్రీనివాసరావు హాజరుకానున్నారు. ఇప్పటికే తాడేపల్లి పట్టణంలో కొండ చుట్టూ రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పించాలని, రైల్వే స్థలాల బాధితులకు పట్టాలిచ్చి అక్కడే నివాసం ఉండే విధంగా చూడాలని, పాడైపోయిన ఇళ్లను కప్పుకునేందుకు రైల్వే అధికారులు అవకాశం ఇవ్వాలని వందలాది మందితో సిపిఎం నాయకులు సంతకాలు సేకరించారు. ప్రజలు పెద్దఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఎం రూరల్,పట్టణ కార్యదర్శులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు కోరారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు

## సైన్స్ ఫలాలను ప్రజలకు అందించాలి

**జెవివి జిల్లా మహాసభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు**

**నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా జాన్‌బాబు, ప్రసాద్**

**ప్రజాశక్తి-గుంటూరు**


బి ప్రసాద్


జాన్‌బాబు

శాస్త్ర, సాంకేతిక విజ్ఞాన ఫలాలు సామాన్య ప్రజలకు చేరువ చేయటమే జనవిజ్ఞాన వేదిక లక్ష్యం అని ఎమ్మెల్సీ, జెవివి జిల్లా గౌరవాధ్యక్షులు కెఎస్ లక్ష్మణరావు అన్నారు. ఆదివారం స్థానిక రైలుపేటలోని కన్న స్కూల్లో జెవివి 17వ జిల్లా మహాసభలు నిర్వహించారు. ఈ ప్రారంభ సభలో లక్ష్మణరావు మాట్లాడుతూ జెవివి అక్షరాస్యత ఉద్యమం, మూఢనమ్మకాల నిర్మూలన, కూల్‌డ్రింక్స్, జంక్‌ఫుడ్‌కు వ్యతిరేకంగా 35 ఏళ్ల నుండి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కన్న విద్యాసంస్థల డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ జెవివి పాఠశాల విద్యార్థులకు చెకుముకి సైన్స్ సంబరాలు, బాలోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తూ వారిలో సృజనాత్మకత వెలికి తీస్తున్నందున సంస్థ సభ్యులను అభినంది ంచారు. ఆధునిక సమాజంలోనూ మూఢ నమ్మకాలు, అశాస్త్రీయ భావజాలం పెరిగిపోతుందని, దానికి తిప్పికొట్టటానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రతినిధులు చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షులుగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఎ.ఆంజనేయులు, డాక్టర్ ఎ.ఎస్.ప్రసాద్, అధ్యక్షులుగా టి.జాన్‌బాబు, ఉపాధ్యక్షులుగా ఎస్.కె.అహ్మద్‌హుస్సేన్, యం.ఉదయభాస్కర్, ప్రధాన కార్యదర్శిగా బి.ప్రసాద్, కోశాధికారిగా జి.వెంకటరావు, కార్యదర్శులుగా టి.అరుణ్‌కుమార్, సిహెచ్.రాము, బి.శంకర్‌సింగ్, ఇ.రాధ, ఆర్.స్వాతి, టి.ఆర్.రమేష్, బి.ఉదయభాస్కర్, వి.ప్రసాద్, ఎస్.ఎం.సుభానీ ఎన్నికయ్యారు.

## టిఫిన్ బండి అందజేత

**ప్రజాశక్తి-తాడేపల్లి:** తాడేపల్లి పట్టణంలోని పోలకంపాడుకు చెందిన చిరువ్యాపారి సిహెచ్.కోటిరెడ్డికి వైసిపి నాయకులు ఆదివారం టిఫిన్ బండి అందజేశారు. వ్యాపారం చేసుకోవడానికి తనకు బండి లేక ఇబ్బందిగా ఉన్న సంగతిని స్థానిక వైసిపి నాయకులకు తెలిపారు. విషయం ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి టిఫిన్ బండి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రధాన కార్యదర్శి ఇ.డేవిడ్ రాజు, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఎం.వెంకట రామిరెడ్డి, కె.సంపూర్ణ పార్వతి, ఎం.విజయ్, ఎస్‌వై నాయుడు, కవిత పాల్గొన్నారు.


టిఫిన్ బండి అందజేస్తున్న వైసిపి నాయకులు

# ఆక్రమణలో ప్రభుత్వ భూములు లేవని బుకాయించొద్దు

- ఎమ్మెల్యే బొల్లా భూముల చుట్టూ ప్రభుత్వ భూములు
- ప్రభుత్వ భూములకు రూ.53 కోట్లు లోన్లు
- బొల్లా అధీనంలో 175 ఎకరాల ప్రభుత్వ భూమి
- అఖిలపక్షాలపై వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాలు, అఖిలపక్షం నాయకులు

ప్రజాశక్తి-వినుకొండ

మండలంలోని బ్రాహ్మణపల్లి రెవిన్యూ జాలల పాలెం గ్రామం వద్ద వినుకొండ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కొనుగోలు చేసిన భూములకు హద్దులు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ప్రకారం చూపుతున్న ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్నాయో తేల్చాలని ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయ ఆవరణలో ప్రజా సంఘాలు, అఖిలపక్షం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా మల్పూరి ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ వద్ద కొనుగోలు చేసిన భూముల్లో 175 ఎకరాల ప్రభుత్వ భూములు ఉన్నాయని, తన ఆక్రమణంలో లేవని బుకాయించడం సరికాదన్నారు. ప్రస్తుతం ఆయన నిర్మాణం చేపడుతున్న ఆవుల ఫారం కూడా ప్రభుత్వ భూమిలో ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వ భూములకు అక్రమంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు పుట్టించి విజయవాడ ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో 53 కోట్లు తనకా రుణం పొంది చీటింగ్ చేయడమే కాక 8 కోట్లు చెల్లించి కొంత భూమిని కనక విడుదల చేసి ప్రభుత్వానికి అమ్మడం జరిగిందన్నారు. జలలపాలెం భూముల విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే ఎమ్మెల్యే అవినీతి పుట్ట వెలుగు చూస్తుందన్నారు. శ్రీవత్స ఫ్యుట్వార్క్ లిమిటెడ్, ఆక్స్ఫర్డ్ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో మొత్తం 116.39 ఎకరాల భూమి ఉండగా ఎమ్మెల్యే 120 ఎకరాల ప్రభుత్వానికి ఎలా విక్రయించాడో చెప్పాలన్నారు. పేదలకు సెంటు భూమి చొప్పున 5400 మంది లబ్ధిదారులకు ఇచ్చిన జగనన్న కాలనీ భూములు నేటికీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు కంపెనీ పేరుపై చూపటం ప్రశ్నార్థకంగా ఉందన్నారు. జలలపాలెం జగనన్న కాలనీ వద్ద 175 ఎకరాల ప్రభుత్వ భూమిలో చెరువు, కుంట, అటవీ, ప్రభుత్వ అసైన్మెంట్ భూములు ఉన్నాయని, వీటిలో కోట్లు విలువ చేసే ఎర్రచందనం కలదని, ఈ భూములు ఎమ్మెల్యే బినామీ ముల్పూరి ఆగ్రోటెక్ పేరుపై బ్రహ్మనాయుడు అక్రమంలో ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వ భూములను అప్పనంగా ఆక్రమించుకొని అనుభవిస్తూ ప్రశ్నించిన మీడియా, ప్రజా సంఘాలు, అఖిలపక్ష పార్టీలపై ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ఎమ్మెల్యే అహంకార ధోరణిని ప్రజలు గమనిస్తున్నారని, తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. మార్కాపురం రోడ్డు పసుపులేరు బ్రిడ్జి వద్ద ఎమ్మెల్యే కొనుగోలు చేసిన 100 ఎకరాల్లో ప్రభుత్వ చుక్కల భూములు ఉన్నాయని వాటిని కూడా ఆక్రమిం చాడని ఆరొపించారు. వినుకొండ కొండ చుట్టూ అధికారం అడ్డం పెట్టుకొని కోట్లు విలువచేసే భూములను హస్తగతం చేసుకున్న చరిత్ర నియోజకవర్గ ప్రజలకు తెలుసునని అన్నారు. రెవెన్యూ అధికారులు ఇటువంటి భూకబ్జాదారులతో కుమ్మక్కై రెవిన్యూ రికార్డులను తారుమారు చేస్తున్న దాఖలాలు ఉన్నాయని అన్నారు.

నియోజకవర్గంలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు హైకోర్టు సిట్టింగ్ జడ్జి కమిటీతో సమగ్ర విచారణ చేప ట్టాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా నాయక్, సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, బూదాల శ్రీనివాసులు, పిడిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై.వి, మస్తాన్వలి, సిపిఎం పట్టణ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు ఆర్కే నాయుడు, ఎమ్మార్పీఎస్ నాయకులు రెడ్డి బోయిన ప్రసన్నకుమార్, జై భీమ్ నాయకులు సురభి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## స్కాలర్‌షిప్‌ల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణంలోని యోగ వేమరెడ్డి సేవా సమితి కార్యాలయంలో ఎడ్యుకేషన్ ట్రస్ట్ సభ్యులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా పేద విద్యార్థులకు అందజేయనున్న స్కాలర్షిప్ లకు సంబంధించి పోస్టర్ని ఆవిష్కరించారు.అనంతరం ఇన్నారెడ్డి తో పాటు భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ. అర్హులైన పేద విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా స్కాలర్షిప్స్ అందజేస్తున్నట్లు తెలిపారు.గత రెండేళ్లుగా స్కాలర్షిప్‌లు అందజేస్తున్నామని, అదే మాదిరిగా ఈ సంవత్సరం కూడా జేఈఈ మెయిన్స్ తో పాటు జేఈఈ అడ్వాన్స్ ఐ ఐ టి , నిట్ పరీక్షలు మెరిట్ సాధించిన, విద్యార్థులకు తమ ట్రస్టు ద్వారా ఈ స్కాలర్షిప్‌ను ఇస్తున్నట్లు పేర్కొన్నారు.స్కాలర్షిప్‌లు పొందాలనుకున్న విద్యార్థులు ఈ నెల పదవ తేదీ తర్వాత వినుకొండ యోగి వేమన రెడ్డి సేవా సమితి కార్యాలయం, అదే మాదిరిగా గుడ్ షఫర్ట్ , గీతమ్స్ పాఠ శాలల్లో అప్లికేషన్లు అందుబాటులో ఉంటాయని, వాటిని అక్టోబర్ 10 వ తేదీలకు లోపు పూర్తిచేసి తిరిగి ఇవే కార్యాలయాల్లో ఇవ్వాలన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్య క్రమంలో కమిటీ సెక్రటరీ సుధాకర్ రెడ్డి. కష్ణారెడ్డి .రామిరెడ్డి .సుందర్ రెడ్డి. బి నారాయణ రెడ్డి .బెజ్జం వెంకటేశ్వర రెడ్డి .టీచర్ రామిరెడ్డి పాల్గొన్నారు.

## రామాంజనేయులు మృతికి సంతాపం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోలా రామాంజనేయులు ఆకస్మిక మృతికి చేనేత కార్మిక సంఘం నాయకులు సంతాపం ప్రకటించారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోలా రామాంజనేయులు అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం ఆకస్మికంగా మతి చెందారు. ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్టా శివదుర్గారావు పల్నాడు జిల్లా అధ్యక్షులు అనుముల వీరబ్రహ్మం లు సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా కట్టా శివదుర్గారావు మాట్లాడుతూ చేనేత కార్మిక సంఘానికి కోలా రామాంజనేయులు ఎనలేని కషి చేశారని అన్నారు. ముఖ్యంగా అనంతపురం జిల్లాలో చేనేత సమస్యలు పవర్ లూమ్ కు వ్యతిరేకంగా అనేక పోరాటాలు చేసి చేనేత కార్మికుల కు అండగా నిలిచారని కొనియాడారు.కోలా రామాంజనేయులు మృతి చేనేత రంగానికి తీరని లోటని అన్నారు.

## టిడిపి నాయకుడు మృతి

ప్రజాశక్తి-అచ్చంపేట

మండలం అంబడిపూడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కోట బాలాజీ అనారోగ్యంతో ఆదివారం మతి చెందాడు మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ బంధువైన కె దిబ్బయ్య తో ఫోన్ ద్వారా తన ప్రగాఢ సానుభూతి తెలిపి వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఆయన భౌతిక గాయానికి టిడిపి నాయకులు నివాళులర్పించారు, నివాళులర్పించిన వారిలో. నందిగం ఆశీర్వాదం గ్రామ మాజీ సర్పంచ్ మచ్చ సూరయ్య పారుపల్లి స్వామి ,రేపూడి తామస్ తిరువాయి పాటి ఆంజనేయులు, ఏసుపోగు నాగయ్య, కోట శ్రీనివాసరావు, కొమ్మవరపు నాగేషు, చిలక రోశయ్య ఉనానరు.

## మహాత్ముల త్యాగాలను గుర్తుంచుకోవాలి

ప్రజాశక్తి- పిడుగురాళ్ల

మహాత్ముల త్యాగాలను గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఆర్అండ్‌బి బంగ్లా వద్ద జ్యోతిరావుపూలే విగ్రహం, పిల్లుట్ల రోడ్డులో చాకలి ఐలమ్మ విగ్రహం, అంబేద్కర్ విగ్రహం వద్ద బాబుజగజ్జీవన్‌రావ్ విగ్రహాల ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని రోడ్ల విస్తరణ జరిగిందని రోడ్లు అన్ని వెడల్పుగా ఉన్నాయని, రెండు నెలల్లో బైపాస్ రోడ్డుపూర్తి అయితే అబ్దుల్ కలాం, మహాత్మ గాంధి, స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను ఏర్పాటు చేసుకుందామని తెలిపారు. త్వరలోనే వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని కూడా ఆవిష్కరించబోతున్నామని ఆయన తెలియజేశారు. ఈకార్యక్రమంలో పట్టణ కన్వీనర్‌చింతా వెంకట రామారావు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము ముక్కంటి, పట్టణ టౌన్ యూత్ నాయకులు మందాసుధీర్, మార్కెట్ యార్డు ఛైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు వైఎస్సార్‌సీపీనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


విగ్రహాల ఏర్పాటుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కాసు

## ఓర్సు నాగరాజుకు ఉత్తమ అసోసియేట్ లెక్చరర్ అవార్డు

ప్రజాశక్తి - మాచర్ల



కొద్దిరోజుల క్రితం వరకు మాచర్ల ఎస్ కే వి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అసోసియేట్ లెక్చరర్ గా పనిచేసిన నాగరాజుకు ఉత్తమ లెక్చరర్ అవార్డు లభించింది. టీచర్స్ డే సందర్భంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు తీసుకోబోతున్నట్లు నాగరాజు తెలిపారు. నాగరాజు ప్రస్తుతం ఎర్రగొండపాలెంలోని ప్రభుత్వ కళాశాలలో లెక్చరర్ గా పనిచేస్తున్నారు. మాచర ప్రభుత్వ కళాశాలలోని లెక్చరర్లు ప్రిన్సిపాల్ ఈ సందర్భంగా నాగరాజును అభినందించారు.



## అప్రకటిత కరెంట్ కట్ తో ఇబ్బంది

ప్రజాశక్తి-కారంపూడి

వేళా పాళా లేని విద్యుత్ కోతలతో రాష్ట్ర ప్రజలు అల్లాడుతుంటే పట్టించుకునే నాధడే లేకుండా పోయాడు అని మండల టీడీపీ నాయకులు విమర్శించారు.ఆదివారం మండల టీడీపీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం లో వారు మాట్లాడుతూ వేసవి కాలం ముగిసినా కూడా విద్యుత్ కోతలు తప్పని పరిస్థితి రాష్ట్రం లో ఉంది అన్నారు.గత టీడీపీ ప్రభుత్వ హయాంలో విద్యుత్ కోత లు లేకుండా 24 గంటలు విద్యుత్ సరఫరా చేసిన ఘనత చంద్రబాబు నాయుడు గారికే దక్కుతుంది అని అన్నారు.వేళా,, పాళా లేకుండా సమయ పాలన లేకుండా రాత్రి పూట కూడా కోతలు విధిస్తున్నారు అని అన్నారు.ఒక వైపు విద్యుత్ కోతలు, మరో వైపు దోమల బారిన పడి విష జ్వరాలు ప్రబలుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయారు అని విమర్శించారు.నాలుగు సంవత్సరాల జగన్ పాలన లో 8 సార్లు విద్యుత్ చార్జీలు పెంచిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అని అన్నారు.గత ప్రభుత్వంలో మిగులు విద్యుత్ వుంటే ఈ ప్రభుత్వ నిర్లక్ష్యం తో విద్యుత్ కొరత ఏర్పడింది అని విమర్శించారు.వర్షాలు లేక వ్యవసాయానికి విద్యుత్ సరఫరా సక్రమంగా చేయక పంటలు ఎండిపోయే పరిస్థితి వల్ల రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అని అన్నారు.విద్యుత్ కోత లను ఆపకపోతే టీడీపీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ను ముట్టడిస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు ఉన్నం.లక్ష్మీనారాయణ,జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి గోళ్ల. సురేష్ యాదవ్,మాజీ మండల టీడీపీ అధ్యక్షులు చప్పిడి. రాము,పట్టణ అధ్యక్షులు కటీకల. బాలకష్ణ,తండా మస్తాన్ జాని, కొదాటీ ప్రభాకర్,చిరుమామిళ్ళ శ్రీనివాసరావు,కర్నాటి మహేష్,కొండపల్లి రవి,మంచి సైదులు,బత్తుల శ్రీను,బాలూ నాయక్,కాల్వ. పేరయ్య, తండా జాని , సైదా తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-నాదెండ్ల

'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని ఆదివారం చిలకలూరిపేట నియేజకవర్గం నాదెండ్ల మండలం అమీన్ సాహెబ్ పాలెం గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి గుర్రం నాగ పూర్ణ చంద్ర రావు, గుర్రం రామా రావు పూనాటి కోటేశ్వరరావు గుర్రం బంగారు బాబు పూనాటి వెంకట్రావు గుర్రం సింగరావు పూనాటి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-సత్తెనపల్లి

గత రెండు రోజులుగా సత్తెనపల్లి పట్టణ 1 వ వార్డు లో టిడిపి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేపట్టారు ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం వచ్చాక భవిష్యత్తుకు భరోసా ఇస్తూ చంద్రబాబు నాయుడు గమ ప్రకటించిన ఆరు పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికి ఏ విధముగా లబ్ధి పొందవచ్చు అనే అంశాలతో కూడిన బాబు షఉరిటీ భవిష్యత్ గ్యారెంటీ పత్రాన్ని అందజేసి వారి వివరాలను నమోదు చేస్తున్నారు .ఒకటో వార్డు నందు ప్రతి ఇంటిని సందర్శించిన ప్రతి ఒక్కరికి వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గన్నమనేని శ్రీనివాసరావు, తురక మేరీ గ్రేస్, మన్నెం శారద దేవి, సాహితి, శ్రావణి, బద్దుల శిరీష తదితరతులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులే సమాజ మార్గనిర్దేశకులు


## ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో విద్యా వ్యవస్థ బలోపేతానికి ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. రాష్ట్ర సమైఖ్య ప్రైవేటు లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఏసీ కాలేజీ సమావేశ మందిరంలో ముందస్తు ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు ప్రైవేటు విద్యా సంస్థల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు సన్మానం నిర్వహించారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ దేశంలో ఏరాష్ట్రంలో లేని విధంగా విద్యా అభివృద్ధికి సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని అన్నారు. ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళతానని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, ఈఎస్ఐ, ప్రావిడెంట్ ఫండ్ వంటివి వచ్చేలా కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా నాలుగు దశాబ్దాల క్రితం ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాన్ని వదులుకొని, పాఠశాలను స్థాపించి వేలాది మందిని తీర్చిదిద్దుతున్న డాక్టర్ కన్న మాస్టర్‌తోపాటు, 45 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకుల్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్గనైజేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ పి.నాగయ్య, రాష్ట్ర అధ్యక్షులు ఎం.సురేష్, ఉపాధ్యక్షులు డి.రమేష్, కళాశాలల ఆర్గనైజేషన్ కన్వీనర్ కె.గోవిందరాజు, రాష్ట్ర కోఆర్డినేటర్ పి.శ్రీనివాసరెడ్డి, జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు బత్తుల దేవానంద్ పాల్గొన్నారు.



కన్న మస్టార్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీలు అప్పిరెడ్డి, కెఎస్ లక్ష్మణరావు తదితరులు



## పాడి రైతుకు ఆర్థిక సహాయం అందజేత

ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎంటిఎంసి పరిధిలోని చిర్రావూరు గ్రామానికి చెందిన పాడి రైతు మొండితోక తంబికి చెందిన పశువుల పాకకు శనివారం నిప్పంటుకుంది. పాకలో ఉన్న గేదె, దూడ అగ్నికి ఆహుతయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న వైసిపి గ్రామ నాయకులు మేకల సాంబశివరావు శనివారం రాత్రి, సంఘటనా స్థలాన్ని సందర్శించి, పాడి రైతును పరామర్శించారు. రూ.15,000 ను తంబికి అందజేశారు.



అధ్యాపకులు యాకోబును సత్కరిస్తున్న క్లబ్ బృందం

## అధ్యాపకులు, ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-తెనాలి

విద్యార్థులకు మార్గదర్శకులు, వారి భవిష్యత్ నిర్దేశకులు ఉపాధ్యాయులేనని రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణానికి చెందిన రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం ఆధ్వర్యంలో ఎంపిక చేసిన 27 మంది అధ్యాపకులు, ఉపాధ్యాయులను సత్కరించారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని వివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజానికి ఉపాధ్యాయులు దిక్సూచి వంటివారని, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సత్కారం అభినందనీయమన్నారు. సత్కారం పొందిన వారిలో జి.లలిత ప్రసాద్, ఎం.అర్జున్,వి వెంకట ప్రతాప్, వైష్ణవి కళాశాల అధ్యాపకులు ఆలూరి యాకోబు, కె.విజయకుమార్, వి.విద్యాసాగర్, కె.అమర్ భాస్కర్, ఎస్ రాజేశ్వరి, ఎం.బాలనాగయ్య నాయక్, ఎం ఆంజనేయ శర్మ, ఎ.జ్యోతి, ఎంవి రఘునాథరావు, బి.ప్రకాశరావు, సయ్యద్ బాబు, కె.బాబు, ఎం. వాసంతి, కె.లక్ష్మీదేవి ఉన్నారు. కార్యక్రమంలో వివేకా విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ రావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.రాంబాబు, ఎన్ వెంకటేశ్వర రావు, అసిస్టెంట్ గవర్నర్ కన్నెగంటి మురళీకృష్ణ, అన్నె రత్న ప్రభాకర్, ఎంఎల్ జగదీశ్వరాంబ పాల్గొన్నారు..

## రామాంజనేయులు మృతికి సంతాపం

ప్రజాశక్తి-మంగళగిరి

ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోలా రామాంజనేయులు ఆదివారం ధర్మవరంలో మతి చెందారు. రామాంజనేయులు మతికి ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లల మర్రి బాలకృష్ణ సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. రామాంజనేయులు చేనేత కార్మికుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారని తెలిపారు. పవర్లూమ్ కు వ్యతిరేకంగా ఉద్యమించాలని తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమానికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. రామాంజనేయులు మరణం చేనేత కార్మిక సంఘానికి తీరని లోటు అని పేర్కొన్నారు. ఇంకా సంతాపం తెలియజేసిన వారిలో చేనేత కార్మిక సంఘం నాయకులు డి రామారావు, కె వెంకటేశ్వరరావు, జె శివ భవన్ నారాయణ లు ఉన్నారు.

# కార్మిక ఐక్యతతో ఫాసిజం ఓటమి

## ప్రొఫెసర్ జి.హరగోపాల్





కపర్ది జయంతి ఉత్సవంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి-గుంటూరు

విశాల ఐక్యత ద్వారా ఫాసిజాన్ని ఓడించటమే కార్మిక వర్గం ముందున్న కర్తవ్యమని పౌరహక్కుల ఉద్యమ నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. ఎఐటియుసి రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మల్లయ్యలింగం భవ న్‌లో కార్మికోద్యమ నేత ఎంవిఎన్ కపర్ది శతజయంతి ఉత్స వాలు నిర్వహించారు. ఎఐటియుసి రాష్ట్ర గౌరవాధ్యక్షులు వి.రాధాకృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హర గోపాల్ 'వర్తమాన ఆర్థిక, సామాజిక, రాజకీయ పరి స్థితులు-కార్మికవర్గం పాత్ర' అనే అంశంపై మాట్లాడారు. అక్టోబర్ విప్లవం స్ఫూర్తితో కార్మికోద్యమం లోకి అడుగు పెట్టిన కపర్ది కార్మికులకు కనీస హక్కులు ఉండాలని పోరా టాలు సాగించా రన్నారు. దేశంలో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెంది తీవ్ర జాతీయ వాదంతో చేతులు కలిపిం దని, దీంతో దేశంలో ప్రజాస్వామ్య ఉనికికే ప్రమాదం ఏర్ప డిందని, హక్కులను రక్షించుకోవటంతోపాటు, ప్రజా స్వామ్యాన్ని, సామాజిక న్యాయాన్ని కాపాడటానికి కార్మిక వర్గం మరోసారి పోరాటాలకు పూనుకోవాలన్నారు. ఏఎన్‌యు ప్రొఫెసర్ వి.అంజిరెడ్డి 'భారత ప్రజా స్వామ్యం- రాజ్యాంగం-ఒక పరిశీలన' అనే అంశంపై ఆయన మాట్లా డారు. నేడు భారతదేశంలోనే కాక అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లోనూ ప్రజాస్వామ్యం సంక్షోభంలోకి వెళ్లిం దన్నారు. ఈ తరుణంలో ఉదారవాద ప్రజాస్వామ్యాన్ని పాడుకోవ టానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు, ఎఐటి యుసి రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్, ఉపా ధ్యక్షులు సోమసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి హను మంతరావు, అధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్ ప్రసంగించారు.



## శ్రీకృష్ణ ఆలయానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-మంగళగిరి

పట్టణంలోని ఇందిరా నగరంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణ ఆలయమునకు శంకుస్థాపన కార్యక్రమం జరిగింది. టి సురేష్, శివ లీల దంపతులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, దుగ్గిరాల ఎంపీపీ సంతోష్ రూపవాణి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు చిన్ని తిరుపతయ్య, దానబోయిన సుందర్రావు యాదవ్, జె శ్రీనివాసరావు, టి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం మైనార్టీ నాయకుల సమావేశం

ప్రజాశక్తి-మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని టిడిపి మంగళగిరి నియోజకవర్గ కార్యాలయంలో ముస్లిం మైనార్టీ నాయకులు ఆదివారం సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ ఘని హాజరయ్యారు. ఈ సమా వేశంలో మంగళగిరి రూరల్ మండలంలోని ముస్లింలలో చైతన్యం తీసుకురావడం, 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ'ని ముస్లింలలోకి తీసుకువెళ్ళేలా బాగా ప్రచారం చేయాలని నిర్ణయించారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్, గుంటూరు పార్లమెంట్ మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ ఖాదర్ వలి (ఫిరోజ్), మంగళ గిరి రూరల్ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పఠాన్ జానిబాషా, మంగళగిరి రూరల్ మైనార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ నజీర్, మంగళగిరి రూరల్ మైనార్టీ సెల్ కార్యదర్శులు షేక్ లాల్ అహ్మద్ బేగ్, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



మంగళగిరిలో సమావేశమైన ముస్లిం మైనార్టీ నాయకులు





మాట్లాడుతున్న డాక్టర్ రాజీవ్‌రెడ్డి

## చక్కని జీవనశైలితో మధుమేహానికి చెక్

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన ఆధ్వర్యంలో ఆదివారం అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఆరోగ్య సభలో ప్రముఖ షుగర్ వ్యాధి నిపుణులు రాజీవ్ రెడ్డి ముఖ్యవక్తగా హాజరై ప్రసంగించారు. మధుమేహం అనేక వ్యాధులకు మూలం అని, మధుమేహం వచ్చిన వారికి బిపి, థైరాయిడ్ వచ్చే అవకాశాలు ఎక్కువని తెలిపారు. సాధారణంగా రక్తంలో చక్కెరస్థాయిలు తినక ముందు 110 ఉండాలని తిన్నతర్వాత 140 వరకుఉండొచ్చన్నారు. లోషుగర్ మరింత ప్రమాదమని తెలియజేస్తూ, మధుమేహం ఎన్ని రకాలు, అది రావటానికి కారణాలు, రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షుగర్ వ్యాధి ఉన్న వారు అనుసరించాల్సిన విధానాలు వివరించారు. మధుమేహం ముఖ్యంగా మూడు రకాలుగా ఉంటుందన్నారు. వంశపారంపర్యం, శారీరక శ్రమ లేకపోవటం, ఆహారం, మానసిక ఒత్తిడి, ఊబకాయం మధుమేహానికి కారణాలని తెలిపారు. మధుమేహం రాకుండా ప్రతి రోజూ వ్యాయామం చేస్తూ, కార్బొహైడ్రేట్స్, రక్తంలోకి వెంటనే చక్కెర శాతాన్ని పెంచే ఆహారం తీసుకోవటం తగ్గించాలని, బరువును అదుపులో ఉంచుకోవాలని, మానసిక ఒత్తిడి అధిగమించాలన్నారు. సమావేశంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు నారపరెడ్డి, సంస్థ సీనియర్ సభ్యులు ఫణికుమార్, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, టి.వి.సాయిరామ్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# పదేళ్లుగా రోడ్డు అధ్వానం

ప్రజాశక్తి-ఫిరంగిపురం

స్థానిక మండలంలోని గరుడాచలపాలెం గ్రామం నుండి 14 వ మైలు వెళ్లే రోడ్డు, గుంటూరు నుండి హైదరాబాద్ వెళ్లే హైవేను కలుస్తుంది. సుమారు రెండు కిలోమీటర్ల దూరం గల ఈ రోడ్డు మార్గం నుండి గరుడాచలపాలెం, తక్కెళ్లపాడు రెండు గ్రామాల ప్రజలు దాదాపు పదేళ్లుగా నుండి అధ్వానంగా తయారైన ఈ రోడ్డును పట్టించుకున్న అధికారులు గానీ ప్రజాప్రతి నిధులు కానీ లేరని రెండు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఆ మార్గం గుండా ప్రయాణించే వాహన చోదకులు, ప్రయాణికులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై వారు మీడియా ఎదుట వాపోయారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ రోడ్డును పునర్నిర్మించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



గరుడాచలపాలెం నుండి 14 వ మైలు వెళ్లే రోడ్డు..

## శిశుమరణాల తగ్గింపునకు కృషి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



మాత శిశు మరణాలను తగ్గించడం కోసం నియంత్రణ చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ తెలిపారు. ఆసుపత్రి సుశృత హాలులో ఆదివారం గైనీకాలజీ విభాగం ఆధ్వర్యంలో మాత శిశు మరణాల నివారణ పై జరిగిన జోనల్ సి యం ఈ వర్క్ షాప్ లో ఆయన మాట్లాడారు. ఈ వర్క్ షాపు లో రాష్ట్రంలోని ఆరు మెడికల్ కళాశాలలకు చెందిన గైనకాలజి విభాగం వైద్య నిపుణులు, 60 మంది పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ గర్భిణులలో ఎక్కువ మందికి రక్త స్రావం జరగడం వల్ల మరణాలు సంభవిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మరణాలను తగ్గించడానికి ఆసుపత్రి వివిధ విభాగలతో ఒక టీంను ఏర్పాటు చేస్తున్నామని ఆయన చెప్పారు. ఈ టీం లో యురాలజస్ట్, జనరల్ సర్జన్, అనాస్థిషియా, హాస్పిటల్ మేనేజ్ మెంట్ తో కూడిన సభ్యులను నియమిస్తామని ఈ విభాగం గైనీకాలజీ విభాగం తో సమన్వయము చేసుకుంటూ మాత శిశు మరణాలను నివారించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. మెడికల్ కళాశాల ఇంచార్జి ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీధర్, గైనీకాలజీ విభాగం హెచ్ ఒ డి డాక్టర్ అరుణ, ప్రొఫెసర్ డాక్టర్ జయంతి, డాక్టర్ వెంకటేశ్వర రావు పాల్గొన్నారు.



## మత్తు వైద్యుల పాత్ర కీలకం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రోగికి శస్త్ర చికిత్స చేయడం లో మత్తు వైద్యులు కీలకమని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. జిజిహెచ్ నాట్కో లో ఆదివారం జరిగిన అల్ట్రాసౌండ్ గైడెడ్ రీజినల్ అనస్థిషియా వర్కుషాప్ లో ఆయన మాట్లాడారు. ఈ వర్కుషాప్ లో తెలంగాణతో పాటు లండన్ నుంచి అనస్థిషియా వైద్య నిపుణులు, పీజీ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ మత్తు లేకుండా ఎలాంటి శస్త్ర చికిత్స లు చేయడం సాధ్యం కాదని అన్నారు. రోగికి నొప్పి లేకుండా ఆల్ట్రాసౌండ్ మిషన్ ద్వారా శస్త్ర చికిత్స చేసే విధానాన్ని వైద్యులు శిక్షణ ఇచ్చారని ఆయన చెప్పారు. ఈ ఆసుపత్రి లో ఒక మిషన్ మాత్రమే రోగులకు అందుబాటులో ఉందన్నారు. ఆల్ట్రా సౌండ్ మిషన్ లు ఎక్కువగా అందుబాటులో వస్తే అనేక మంది ప్రాణాలను కాపాడేందుకు అవకాశం కలుగుతుందని ఆయన చెప్పారు. మత్తు లేకుండా ఆపరేషన్ చేయడమంటే చాలా మందికి భయంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఆల్ట్రా సౌండ్ ద్వారా నొప్పి లేకుండా ఆపరేషన్ లు చేసి రోగులను బ్రతికించేందుకు అవకాశం ఉంటుందని ఆయన అన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఆపరేషన్ దియేటర్ లో ఆల్ట్రా సౌండ్ మిషన్ లను ఏర్పాటు చేసి రోగులకు అవసరమైన ఆపరేషన్ లు జరిగే విధంగా కృషి చేస్తామని ఆయన వివరించారు. అనాస్థిషియా విభాగం హెచ్ ఒ డి డాక్టర్ బి వి మహేష్ బాబు, డాక్టర్ కె పి పోలయ్య, డాక్టర్ ఘంశం బియాని, డాక్టర్ శ్రీప్రకాష్, డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ టి వి ఎస్ గోపాల్, పాల్గొన్నారు.

## చిత్ర కళాప్రదర్శనను సందర్శించిన మేయర్

**ప్రజాశక్తి-గుంటూరు** :స్థానిక బృందావన్ గార్డెన్స్‌లోని వెంకటేశ్వరా దేవస్థాన ప్రాంగణంలో మధుర్ ఆర్ట్ స్కూల్ వారు ఏర్పాటు చేసిన కేరళ మ్యురల్ చిత్ర కళా ప్రదర్శనను మేయర్ సందర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆర్ట్స్ స్కూల్ విద్యార్థులు వేసిన పెయింటింగ్స్ ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. వీరికి అద్భుత శిక్షణ ఇచ్చిన మధు సూదన్ తెలుగు రాష్ట్రాల్లో 'మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్' లో స్థానం సంపాదించిన మొదటి వ్యక్తి అని తెలిపారు. గత 25 సంవత్సరాలుగా చిత్ర కళాకారునిగా అన్ని వయస్సుల వారికీ శిక్షణ ఇస్తూ, ఎంతో మంది చిత్ర కళాకారులను తయారు చేశారన్నారు. భవిష్యత్ లో మంచి చిత్రాలు వేసి ఆర్టిస్టుగా ప్రజల మన్ననలు పొంది వీరిలాంటి ఎంతో మంది ఆర్టిస్టులను తయారు చేయాలన్నారు. అనంతరం పెయింటింగ్స్ వేసిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మధుర్ ఆర్ట్ స్కూల్ గుంటూరు కరస్పాండెంట్ మధు సూదన్, పెయింటింగ్ కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



చిత్రకళాప్రదర్శనలో విద్యార్థులతో మేయర్

# కెవిఆర్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

### ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో ఎంపి ఆళ్ల అయోధ్యరామిరెడ్డి




సన్మానం అందుకున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులతో అయోధ్యరామిరెడ్డి, కెఎస్ లక్ష్మణరావు తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

తమ తల్లిదండ్రుల పేరుతో ట్రస్ట్ స్థాపించి, నీతి నిజాయితీగా సేవలు అందిస్తున్న ఉపాధ్యాయుల్ని గుర్తించి, గత 15 సంవత్సరాలుగా సత్కరిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు దంపతులు ప్రశంసనీయులని రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి అన్నారు. కెవిఆర్ అండ్ జయలక్ష్మి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి స్థానిక వెంకటేశ్వరా విజ్ఞాన మందిరంలో అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్న 31 మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపరుచుకొని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడుతూ విద్యావేత్తగా, శాసన మండలి సభ్యులుగా లక్ష్మణరావు సమాజం పట్ల ఉన్న నిబద్ధత సాటిలేనిదని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ట్రస్ట్ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పిల్లలకు మనసు పెట్టి పాఠాలు బోధించే ప్రతి ఉపాధ్యాయుడూ ఉత్తమ ఉపాధ్యాయుడేనని అన్నారు.సాంకేతిక పరిజ్ఞానం ఉపాధ్యాయులకు ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదన్నారు. విద్యార్థుల్లోని నైపుణ్యాలను గుర్తించి అభివృద్ధి చేయాలని కోరారు. అనంతరం ఎంపి అయోధ్యరామిరెడ్డి, డొక్కా మాణిక్యవరప్రసాద్, కెఎస్ లక్ష్మణరావు చేతులమీదుగా ఎంపికైన ఉపాధ్యాయులకు జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందచేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.విజయలక్ష్మి, లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ ఎన్.వీరప్రకాష్, యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్, కె.విజయకుమారి తదితరులు ప్రసంగించారు.



# అదనపు ఫీజుల వసూలు తగదు

### ఆస్పత్రులపై ఫిర్యాదులు వస్తే తక్షణం చర్యలు

### 303 నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు

### ప్రజాశక్తితో జిల్లా కో-ఆర్డినేటర్ జయరామకృష్ణ






ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

ఆరోగ్యశ్రీ నెట్‌వర్కు ఆస్పత్రుల్లో రోగుల నుంచి అదనపు ఫీజులు వసూలు చేయరాదని జిల్లా ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్. జయరామకృష్ణ తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా చికత్స లేక శస్త్ర చికిత్సలకు సొమ్ము తీసుకున్నట్టు ఫిర్యాదులు వస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. దేశంలో అన్ని రాష్ట్రాల కన్నా రాష్ట్రంలోనే ఎక్కువ ఫీజులతో ఆరోగ్యశ్రీ సేవలను ప్రభుత్వం నిర్ధేశించిందని అందువల్ల ప్రజల నుంచి అదనపు ఫీజు వసూలు సరికాదన్నారు. రూ.5లక్షల లోపు ఆదాయం ఉన్న వారు ఎవరైనా ఆరోగ్యశ్రీ కార్డులకు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

**అదనపు ఫీజులపై ఎవరికి ఫిర్యాదులు చేయాలి?**

సచివాలయం హెల్త్ అసిస్టెంట్‌లకు చెప్పవచ్చు. శస్త్ర చికిత్స తరువాత వారే ఫోటోతో వివరాలు అప్‌లోడ్ చేస్తారు. తరువాత ఆరోగ్యశ్రీట్రస్టు నుంచి నేరుగా సంబంధిత రోగికి ఫోన్ వస్తుంది.వారికి చెప్పవచ్చు.ట్రస్టు వారు 4, 5 పద్ధతుల్లో రోగుల నుంచి సమాచారం రాబడుతున్నారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే వెంటనే జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ఉంటుంది. కమిటీత విచారించి అదనపు ఫీజు వసూలు చేసినట్టు నిర్ధారణ అయితే సంబంధిత ఆస్పత్రికి 10 రెట్లు ఫెనాల్టి వేస్తారు. ఇందులో 90 శాతం సొమ్మును రోగికి తిరిగి ఇస్తారు. ప్రభుత్వం ఈ అంశంపై అనేక రూపాల్లో నిఘా ఉంచింది. ఫిర్యాదు వస్తే మాత్రం సంబందిత ఆస్పత్రులపై చర్యలు తప్పవు. ఇప్పటికే పలు ఆస్పత్రులపై చర్యలు తీసుకున్నాం.

**ఆరోగ్యశ్రీ ఎన్ని ఆస్పత్రులలో అమలులో ఉంది?**

ఉమ్మడి జిల్లాలో మొత్తం 303 ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉన్నాయి. గుంటూరు జిల్లాలో 134, పల్నాడు జిల్లాలో 110, బాపట్ల జిల్లాలో 59 ఆస్పత్రుల్లో మొత్తం 3257 వ్యాధులకు చికిత్స, శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులు, ఫించను దారులకు, హెల్త్ కార్డులు ఉన్న ఎక్రిడేటెడ్ జర్నలిస్టులకు 2500 వ్యాధులకు, ఆరోగ్య రక్ష ద్వారా ఎగువ మధ్య తరగతి వారికి 1044, అమృత హెల్త్ స్కీమ్ ద్వారా అనాధలకు, నిరాదరణకు గురైన వారికి 1059, ఆయుష్మాన్ భారత్ ద్వారా 1949 వ్యాధులకు ఆరోగ్యశ్రీ చికిత్సలు ఉచితంగా చేస్తున్నారు.

**ప్రభుత్వం నుంచి ఆస్పత్రులకు బకాయిలు ఉన్నాయా?**

గరిష్టంగా మూడు నెలలకు మించి పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు వస్తున్నాయి. ఆరోగ్యశ్రీ ట్రస్టు ద్వారా ఆస్పత్రుల ఖాతాల్లో జమ అవుతున్నాయి. ఇటీవలే బకాయిలు అన్ని క్లియర్ అయ్యాయి. గతంలో మాదిరిగా ఎక్కువ రోజులు పెండింగ్‌లో ఉండటం లేదు. గత నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాలో 5,80,647 మందికి రూ.1370. 59కోట్లు ఆరోగ్యశ్రీ చికిత్సలకు ఖర్చు చేశాం.

**ఆరోగ్య ఆసరా పథకం?**

ఆరోగ్యశ్రీ ద్వారా 1519 వ్యాధులకు సంబంధించిన శస్త్ర చికిత్సలు చేయించుకున్న తరువాత ఏ పనికి వెళ్లలేని వారికి నెలకు రూ.5వేలు చొప్పున అందిస్తున్నాం. గత నాలుగేళ్లలో 2,62,791 మందికి 139.47 కోట్లు అందించాం.

**ఆరోగ్యశ్రీ కార్డులు ఎన్ని ఉన్నాయి?**

గుంటూరు జిల్లాలో 5,97,635 కార్డులు, పల్నాడు జిల్లాలో 6,40,010 కార్డులు, బాపట్ల జిల్లాలో 4,71,292 కార్డులు ఉన్నాయి.

**ఆయుష్మాన్‌భారత్ కార్డులు పంపిణీ చేశారా?**

ఆయుష్మాన్ భారత్ గుంటూరు జిల్లాకు 9,00,147 కార్డులు, పల్నాడుకు 9,86,248 కార్డులు, బాపట్ల జిల్లాకు 6,49,574 కార్డులు ప్రభుత్వం నుంచి ఆయా సచివాలయాలకు పంపుతున్నారు. త్వరలో వీటిని వాలంటీర్ల ద్వారా సంబంధిత లబ్ధిదారులకు పంపిణీ చేస్తారు.